జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఖమ్మం
సోమవారం 2 నవంబర్ 2026
పేజీలు : 8

జర్నలిస్టుల సంక్షేమం హక్కుల సాధనే టీజేఎఫ్ లక్ష్యం



సమిష్టి కృషితోనే సమస్యలకు పరిష్కారం

జర్నలిస్టుల ఉద్యమ స్ఫూర్తి అల్లం నారాయణ

జిల్లాలో 1,200 అక్రిడిటేషన్ కార్డుల మంజూరు

టీజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట ఆదినారాయణ,చిర్రా రవి

5

ఆగని మట్టి దందా!

- అధికారులు మాకు ఎందుకులే అని వదిలేస్తున్నారా.?
- ఆదివారం అధికారులు లేకుండా ఆసరాగా చేసుకున్న అక్రమార్కులు
- అసైండ్ భూముల నుంచి జోరుగా ఎర్రమట్టి దందా
- అధికారుల కళ్ళు కప్పుతున్న అక్రమార్కులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతున్న పట్టించుకోని వైనం
- ప్రతిరోజు కొనసాగుతున్న ఇదే తతంగం
- అధికారులకు సమాచారం అందించిన ఆగని ట్రాక్టర్లు
- అధికారుల కను సన్నల్లోనే జరుగుతున్నట్లు ఆరోపణలు
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ శాఖ
- అక్రమ మట్టి రవాణాను అరికట్టే నాధుడే లేడా అంటున్న మండల ప్రజలు

బోనకల్ మండలం చిరునోముల గ్రామంలో అసైన్డ్ భూముల నుంచి ఎర్రమట్టి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సెలవు రోజులను ఆసరాగా చేసుకొని ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు ఇవ్వలేదని తహసీల్దార్ స్పష్టం చేసినప్పటికీ, సమాచారం అందించినా రవాణా ఆగకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

3





7

కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు నవంబర్ 6లోగా పూర్తి చేయాలి

కేసీఆర్, కేటీఆర్ పిలుపులను విజయవంతం చేయాలి... పార్టీ బలోపేతానికి సమష్టిగా పనిచేయాలి

కాంగ్రెస్ పాలనపై నామా విమర్శలు.. మధిరలో బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశం

భగవద్గీత శ్లోకాల పోటీలలో టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

జిల్లా స్థాయిలో ప్రథమ, తృతీయ స్థానాలు కైవసం

సత్తుపల్లి నవంబర్01(ప్రజా జ్యోతి) ఖమ్మం జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి భగవద్గీత శ్లోకాల పోటీలలో, సత్తుపల్లి టాలెంట్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి పాఠశాలకు గర్వకారణంగా నిలిచారు. ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో జిల్లా ప్రథమ స్థానాన్ని చిన్నంశెట్టి లాస్య శ్రీ, తృతీయ స్థానాన్ని షేక్ ఆస్పియా సాధించగా, జూనియర్స్ విభాగంలో వకుల్ సావర్కర్ జిల్లా ప్రథమ స్థానాన్ని సాధించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు నిర్వాహకుల చేతుల మీదుగా మెమెంటోలు మరియు ప్రశంసా పత్రాలు అందజేశారు. అదేవిధంగా, భగవద్గీత శ్లోకాల పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మూడవ తరగతి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 1,500 రూపాయల చొప్పున నగదు బహుమతులను అందజేసి ప్రోత్సహించారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే భగవద్గీత పట్ల ఆసక్తిని పెంపొందించడం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, నైతిక విలువలను అలవర్చుకోవడం అభినందనీయమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ సందర్భంగా విజేత విద్యార్థులను



పాఠశాల కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పులి అరుణ, పాఠశాల ఇన్‌చార్జి శంకర్, ఉపాధ్యాయ బృందం అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

మండలంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్.

కోటమైసమ్మ తల్లిని దర్శించుకున్న నాయక్.

కారేపల్లి, నవంబర్ 1 ప్రజా జ్యోతి :వైరా నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ ఆదివారం సింగరేణి మండలంలో పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ముందుగా ఉసిరికాయలపల్లిలోని కోటమైసమ్మ తల్లి ఆలయాన్ని దర్శించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పర్స పట్టాభి రామారావు ఆయనకు ఘనంగా ఆహ్వానం పలికి శాలువతో సత్కరించారు. అనంతరం కోటమైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొత్తలంక కైలాస శర్మ కుమారుడు శంకర్ శర్మ-శరణ్య నూతన దంపతులను రాములు నాయక్ ఆశీర్వదించి నూతన దంపతుల వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వచనాలు అందించారు. మండల కేంద్రమైన కారేపల్లి లో ఉపాధ్యాయుడు కేలోత్ నరేష్ నూతనంగా నిర్మించిన గృహ ప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. లావుడియా వాగ్య నాయక్ నివాసంలో తేనెటు విందును స్వీకరించారు. ఉపాధ్యాయుడు నరేష్ నాయక్ నూతన గృహప్రవేశానికి వచ్చిన ఉపాధ్యాయుల ,వివిధ సంఘాల నేతలతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో



నాయకులు అజ్మీర వీరన్న, జాల సాంబ, దారావత్ రాంజీ, భూక్య రాంకిషోర్, గుగులోత్ సురేష్,జర్పుల చందర్, ఉపాధ్యాయ సంఘాల నేతలు భూక్య శ్యామ్ లాల్, మాలోత్ ప్రతాప్ సింగ్, గుగులోతు రవీందర్ నాయక్, అజ్మీర వీరు నాయక్, రాజు నాయక్, బానోత్ మంగీలాల్ నాయక్ , కేలోత్ రాములు నాయక్, టిడిపి నాయకులు వాంకుడొత్ మత్రు, వాంకుడొత్ లక్ష్మణ్, అంగోత్ శంకర్, వార్డు సభ్యులు భూక్య కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాల ఆవరణ అభివృద్ధి

17వ వార్డు ఎంపియుఎస్ పాఠశాలలో మట్టి పోయించి చదును చేస్తున్న కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజకుమార్

కల్లూరు, నవంబర్ 1 : ప్రజా జ్యోతి కల్లూర్ అంబేద్కర్ నగర్లోని 17 వ వార్డు ఎం పి యు పి ఎస్ పాఠశాల ఆవరణ పల్లుడు కారణంగా నీరు నిల్వ ఉండడంతో బురద మాయంగా మారి విద్యార్థులు ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థుల రాకపోకలకు ఇబ్బంది పడడమే కాకుండా పాఠశాల ఆవరణం అపరిశుభ్రంగా మారుతున్నాయి ఈ సమస్యను గుర్తించడం 17వ వార్డు కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజకుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని పాఠశాల ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా మట్టి పోయించి చదును చేయించే పనులకు శ్రీకారం చుట్టారు. ట్రాక్టర్ ద్వారా మట్టిని తరలించి పాఠశాల ప్రాంగణాన్ని చదును చేయించారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పాఠశాల ఆవరణలో స్వేచ్ఛగా తిరిగేందుకు ఆటలు ఆడుకునేందుకు



అనుకూలమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ పనులు చేపట్టారు. పాఠశాల సమస్యలను గుర్తించి స్వయంగా చొరవ చూపి పనులు చేపట్టిన కౌన్సిలర్ కనపర్తి శ్యామల రాజకుమార్ ను స్థానికులు అభినందించారు.

ఢిల్లీలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రిను కలిసిన పలువురు కాంగ్రెస్ నాయకులు



చింతకాని నవంబర్ 01ప్రజాజ్యోతి (ప్రతినిధి) ఢిల్లీలోని తెలంగాణ భవన్ శబరి గెస్ట్ హౌస్‌లో తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ,సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మత్కేపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు, చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కన్నెబోయిన గోపి, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు మడుపల్లి భాస్కర్ గాంధీనగర్ ఉపసర్పంచ్ వంగూరు రమేష్ కాంగ్రెస్ నాయకులు లిఆలస్యం బసవయ్య వనం బాబు కూరపాటి రాము తదితర ముఖ్య కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు

అనగాని సూరమ్మ చిత్రపటానికి బీజేపీ పార్టీల నాయకుల నివాళులు,



చింతకాని నవంబర్ 01ప్రజాజ్యోతి : భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా ఓబీసీ కార్యదర్శి అనగాని రామారావు మాతృమూర్తి అనగాని సూరమ్మ ఇటీవల శివైక్యం చెందారు ఈరోజు చింతకాని మండలం నాగులవంచ గ్రామం లో వారి స్వగృహం నందు జరిగిన దశదిన కర్మ కు సహచర బీజేపీ కుటుంబ సభ్యులతో కలిసి చిత్రపటానికి నివాళులు అర్పించటం జరిగింది. సూరమ్మ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతకాని బీజేపీ మండల అధ్యక్షులు కొండా గోపి, మధిర అసెంబ్లీ నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు మందడపు సుబ్బారావు, కిసాన్ మోర్చాజిల్లా అధ్యక్షులు నరుకుల్లా వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి గోదా మంగయ, కొరిపెల్లి శ్రీను, ఉపాధ్యక్షులు బక్క సత్యమూర్తి,రాజేష్ గుప్త,రెగన్ ప్రతాప్,గడీల నరేష్,రమేష్ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ఆగని మట్టి దందా!

బోనకల్, నవంబర్ 01(ప్రజా జ్యోతి):

మండల పరిధిలోని చిరునోమల గ్రామంలో ఎర్ర మట్టి దందా జోరుగా సాగుతుంది. ధనార్జనే ధ్యేయంగా ఈ అక్రమ మట్టి దందా సాగుతున్న పట్టించుకునే అధికారులు కరువయ్యారు. ఆదివారం సెలవు దినాన్ని ఆసరాగా చేసుకొని జెసిబిల సహాయంతో ఆదివారం ఉదయం తెల్లవారుజామున నుండి సాయంత్రం వరకు పట్టపగలే ఈ దందా కొనసాగుతుంది. గత కొన్ని రోజులుగా చిరునోమల గ్రామం నుండి ఈ దంద కొనసాగుతున్న అధికారులు పట్టించుకోకపో వడంపై పలు ఆరోపణలు కూడా వస్తున్నాయి. ఇదే అదునుగా భావించిన మట్టి అక్రమ దారులు ఎటువంటి అనుమతులు లేకుండా చిరునోమల అసైన్డ్ భూముల నుండి యదేచ్ఛగా ఎర్ర మట్టిని తరలించుకుపోతున్న అధికారులు చోద్యం చూస్తున్నారు. దీనితో ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి పడుతుందని తెలిసికూడా అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నారో ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనితో చిరునోమల ఎర్ర మట్టి దందా ఆగనంటుందా.? అంటూ మండల ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ అక్రమ మట్టి దందాకు అడ్డుకట్ట వేసే అధికారులే లేరా మండల ప్రజలు మండి పడుతున్నారు. అధికారు లకు సమాచారం అందించిన అక్రమ మట్టి



ట్రాక్టర్లు ఆగకపోవడంపై అధికారులే పూర్తిగా సహకరిస్తున్నారని ఆరోపణలు జోరుగా వినిపిస్తు న్నాయి. అక్రమార్కులు ఆదివారం అధికారులు లేని సమయాన్ని చూసుకొని మట్టి అక్క మార్కులు ఈ దందాకు పాల్పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ కరువడంతో అక్రమార్కులకు వరంగా మారింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఈ మట్టి తరలింపును కొనసాగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. అయితే ప్రభుత్వ భూములు, అసైన్ భూములు పర్యవేక్షణ మాత్రం అధికారులదే. కానీ ఈ పర్యవేక్షణలో అధికారులు పూర్తిగా విఫలమై నట్లు తెలుస్తుంది. దీనితో పదుల సంఖ్యలో ట్రాక్టర్లను రంగంలో దింపి ఈ ఎర్ర మట్టిని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మైనింగ్, రెవెన్యూ శాఖ అనుమతులు లేకుండానే ఈ వ్యవహారం కొనసాగుతుంది. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం అక్రమార్కులకు అవకాశం గా మారిందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు ఉండే దినాలను మట్టి అక్రమార్కులు అనుకూలంగా మలుచుకొని ఈ దందాను కొనసాగిస్తున్నారు. సాధారణ రోజులతో పోలిస్తే సెలవు రోజులలోనే ఈ అక్రమం మట్టి దందా జోరుగా కొనసాగుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. నిరంతరం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి ఈ మట్టి తరలింపు కొనసాగిస్తున్నారని స్థానికులు అంటున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అధికారుల అనుమతులు లేకుండానే ఇంత పెద్ద ఎత్తున అక్రమ మట్టి రవాణా ఎలా కొనసాగుతుందని ప్రశ్నిస్తున్నారు. ట్రాక్టర్లతో ఎర్ర మట్టి నింపుకొని గ్రామాలలో అతి వేగంతో వెళు తుంటే దుమ్ము ధూళితో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మట్టి తరలింపుకు సంబంధించిన అనుమతి పత్రాలను పరిశీలించాలని అన్నారు. అక్రమ ఎర్రమట్టి దందాపై చిరునోమల జిపిఓ కు సమాచారం అందించగా తమకు తెలియదని రామాపురం భూ సర్వేలో ఉన్నామని తెలిపారు. స్థానిక తహసిల్దార్ కు సమాచారం అందించండి అన్నారు.

అధికారులకు సమాచారం అందించిన ఆగని మట్టి ట్రాక్టర్లు...

ఎర్రమట్టి అక్రమ రవాణాపై స్థానిక మండల అధికారులకు సమాచారం అందించిన అక్రమం మట్టి తోలకాలు మాత్రం ఆపింది లేదు. అధికారుల అలుసును ఆసరా చేసుకొని ఎవరు పట్టించుకోరులే అన్న విధంగా ఈ మట్టి దందా కొనసాగుతుంది. దీనితో స్థానిక ప్రజలు అధికారులపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు.

తాహసిల్దార్ చల్లూరి సుధాకర్ వివరణ..

ఈ అక్రమ ఎర్రమట్టి దందాపై స్థానిక బోనకల్ తహసిల్దార్ చల్లూరి సుధాకర్ ను వివరణ కోరగా మేము ఎటువంటి మట్టి రవాణాకు అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. వెంటనే స్థానిక జిపిఓను పంపిస్తానని అన్నారు. అధికారులకు సమాచారం అందించిన ఆగని మట్టి ట్రాక్టర్ల పై మరోసారి తాహసిల్దార్ కు తెలుపగా మట్టి తోలే వారితో మాట్లాడానని వెంటనే ట్రాక్టర్లను ఆపేస్తారని తహసిల్దార్ చల్లూరి సుధాకర్ అన్నారు. కానీ అధికారులకు సమాచారం అందించిన చిరునో మల అక్రమ మట్టి రవాణా ఆగకపోవడంపై మర్మమేమిటో తెలియాల్సి ఉంది.?

ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్సీ ఓట్ల నమోదు

ప్రతి పట్టభద్రుడు పేరు నమోదు చేసుకోవాలి

నవంబర్ 6తేదీలోగా ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి

గతంలో ఓటు వేసినప్పటికీ తిరిగి తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారందరూ అర్హులు

నెలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్



పాలేరు ఆర్.సీ నవంబర్ 01 ప్రజా జ్యోతి కూసుమంచి మండలం జీళ్ళచెరువు గ్రామంలో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటు హక్కు నమోదు కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు, కూసుమంచి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జీళ్ళచెరువు గ్రామంలో పట్టభద్రుల ఓటు నమోదు కార్యక్రమాన్ని స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు ముమ్మరంగా నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పట్టభద్రులను కలిసి ఓటు హక్కును ఆన్ లైన్ లో నమోదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పట్టభద్రులందరు తప్పకుండా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ నెల 6వరకు మాత్రమే గడువు ఉందని, ఈ గడువు లోపు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓటు హక్కు నమోదు ఇంచార్జ్ పెండ్ర అంజయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ మొక్క ఉపేందర్, దేవాలయం మాజీ చైర్మన్ అంబాల లింగయ్య, మాజీ ఎంపీటీసీ కాసాని వెంకన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కొండా శ్రీనివాస్ రావు, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు బెజవాడ శ్రీకాంత్, నాయకులు అంబాల రామనాధం, గోపి లక్ష్మయ్య, గుమ్మడెల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సావిత్రి అకాల మృతి విద్యారంగానికి తీరని లోటు.

-ఉపాధ్యాయ సంఘాల నాయకులు.



కారేపల్లి,నవంబర్ 1,ప్రజా జ్యోతి : సింగరేణి మండల కేంద్రంలో కారేపల్లిలో గల తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల మాజీ ప్రిన్సి పల్ దారా సావిత్రి అకాల మృతి విద్యారంగానికి తీరని లోటని వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు అన్నారు.ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సావిత్రి సంతాప సభను ఆదివారం ఖమ్మం పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల వంశీకృష్ణ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు హాజరై మాట్లాడుతూ.. సావిత్రి మృతి తమను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆలస్యంగా సంతానం కలిగినప్పటికీ పాఠశాలలోని విద్యార్థులందరినీ తన బిడ్డలుగా భావించి ఆప్యాయతతో చూసుకునేవారని గుర్తుచేశారు.ఉపాధ్యాయ వృత్తిని కేవలం ఉద్యోగంగా కాకుండా బాధ్యతగా భావించి విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారని కొనియాడారు. సావిత్రితో కలిసి పనిచేసిన పలువురు ఉపాధ్యాయులు ఆమెతో తమకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. విధుల పట్ల ఆమె చూపిన నిబద్ధత,క్రమశిక్షణ, విద్యార్థుల పట్ల కనబరిచిన ఆప్యాయత,సహచర ఉపాధ్యాయులతో ఉన్న సత్సంబంధాలను స్మరించుకున్నారు.ఆమె సేవలను కొనియాడుతూ ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మృతురాలి భర్త ఉపేందర్,బిఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు షేక్ గౌసుద్దీన్, ఖలీల్ ఉల్లాఖాన్,సీనియర్ జర్నలిస్ట్ పగడాల నాగేశ్వరావు,వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు,తోటి ఉద్యోగులు,కుటుంబ సభ్యులు,బంధువులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు 401 విద్యార్థులు హాజరు

సత్తుపల్లి నియోజకవర్గంలో 430 మంది దరఖాస్తు 29 మంది గైర్హాజరు







కల్లూరు, నవంబర్ 1 : ప్రజా జ్యోతి జాతీయ ఆదాయ ఆధారిత ప్రతభా ఉపకార వేతన పథకం (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం పరీక్ష ఆదివారం కల్లూరు పట్టణంలో ప్రశాంతంగా నిర్వహించారు. సత్తుపల్లి నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధి నుంచి మొత్తం 430 మంది విద్యార్థులు పరీక్షకు దరఖాస్తు చేసుకోగా కల్లూరులో ఏర్పాటుచేసిన రెండు పరీక్ష కేంద్రాల్లో 401 మంది విద్యార్థులు హాజరయ్యారు మరో 29 మంది గైర్హాజరయ్యారు. కల్లూరు మున్సిపల్ లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష నిర్వహించారు.

పేద విద్యార్థులకు ఉపకార వేతనం

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న ప్రతిభావంతులైన ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్ఎంఎంఎస్ పథకాన్ని అమలు చేస్తుంది ఈ పరీక్షల్లో మెరిట్ ఆధారంగా ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి 12 తరగతి వరకు ఏటా రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందించడం జరుగుతుంది నాలుగేళ్లలో మొత్తం రూ. 48 వేల ఆర్థిక సహాయం లభిస్తుంది పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులను అధిగమించి ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఈ పథకం దోహదపడుతుంది పరీక్షా కేంద్రంలో చీఫ్ సుపిరిశిటెశీడెంట్ గా డిప్యూటీ తహశీల్దార్ కల్లూరు, సి. ఎస్ పద్మ, వైరా ఎంఈఓ కే వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు. ఉపాధ్యాయులు సిఆర్పిలు సిబ్బంది పాల్గొన్నారు

సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం : మోకు దెబ్బ నాయకులు.

సింగరేణి మండల కమిటీ ఎన్నిక.



కారేపల్లి, నవంబర్ 1 ప్రజా జ్యోతి : గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐక్యంగా పోరాడుదామని ఖమ్మం జిల్లా మోకు దెబ్బ అధ్యక్షులు బండి నాగేశ్వరరావు, రాష్ట్ర గౌడ సంఘ ఉపాధ్యక్షులు డాక్టర్ మారుతి బాబు లు పిలుపునిచ్చారు. సింగరేణి మండల మోకు దెబ్బ మహాసభ ఆదివారం సింగరేణి మండల కేంద్రం కారేపల్లి లో జరిగింది. సమావేశంలో వారు మాట్లాడుతూ కల్లు గీత కార్మికుల జీవనోపాధికి ఆధారమైన తాటి, ఈత చెట్లను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ప్రభుత్వ భూముల్లో, చెరువు గట్లపై తాటి మొక్కలను నాటాలని, ఉన్న చెట్లను నరికివేయకుండా కఠిన చట్టాలు తేవాలన్నారు. గీత కార్మికులు తాము సేకరించిన కల్లును గౌరవప్రదంగా విక్రయించేందుకు మండల కేంద్రాలలో ప్రభుత్వం ఆధ్వర్యంలో కల్లు డిపోలను ఏర్పాటు చేయాలని కోరారు. వృత్తి రీత్యా చెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తు కిందపడి మరణించినా, శాశ్వత వికలాంగులైన గీత కార్మికుల కుటుంబాలకు ఇచ్చే ప్రమాద బీమా రూ.10 లక్షలకు పెంచాలని, ఎలాంటి జాప్యం లేకుండా ఎక్స్‌గ్రేషియా వెంటనే అందేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. 50ఏండ్లు నిండిన ప్రతి గీత కార్మికునికి పెన్షన్ మంజూరు చేయాలన్నారు. గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక.

సింగరేణి మండల గౌడ సంఘ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. మండల అధ్యక్షులుగా ఆరెళ్ళ రవి గౌడ్, ఉపాధ్యక్షులు గా గౌని అర్జున్ గౌడ్, కార్యదర్శిగా గడ్డం వెంకట్ గౌడ్, జనరల్ సెక్రటరీగా బండి వెంకట్ గౌడ్, కోశాధికారిగా తోడేటి రమేష్ గౌడ్ లను ఎన్నుకున్నారు. నూతనంగా కమిటీ రాజకీయాలకు అతీతం గా మండలంలోని గౌడ కులస్థులందరినీ ఏకతాటిపైకి తెచ్చి, స్థాని కంగా ఉండే సమస్యలపై నిరంతరం పోరాడాలని నాయకులు కోరారు.

మహానీయుడు తూము ప్రకాశరావు

బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ అభినందనీయం

క్యాంపు బిపి, షుగర్ పేషంట్లకు వరం

ఆర్ఎంపీడబ్ల్యూఏ టిఎస్ జిల్లా అధ్యక్షులు బొమ్మినేని



బోనకల్, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రాణాన్ని త్యాగం చేసిన మహానీయుడు తూము ప్రకాశరావు అని తెలంగాణ గ్రామీణ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మినేని కొండలరావు అన్నారు. అదివారం మండల కేంద్రంలోని తూము ప్రకాశరావు భవన్ లో బత్తినేని చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సిపిఐ సీనియర్ నాయకులు, అమరజీవి తూము ప్రకాశరావు జ్ఞాపకార్థం 74వ బిపి, షుగర్ ప్రత్యేక క్యాంపు విజయవంతమైంది. ఈ సందర్భంగా బొమ్మినేని కొండలరావు మాట్లాడుతూ నేటి మధిర ప్రాంత అభివృద్ధి వెనుక కమ్యూనిస్టు ఉద్యమాల త్యాగగాథ దాగి ఉందన్నారు. పేదలు, వ్యవసాయ కూలీలు, దళితుల హక్కుల కోసం తూము ప్రకాశరావు నిరంతరం పోరాడారని, ఆయన జీవితం ప్రజా ఉద్యమాలకు ఆదర్శమని కొనియాడారు. బిపి, షుగర్ పేషంట్లకు బత్తినేని ఛారిటబుల్ ట్రస్ట్ సేవలు ఓ వరమని, మండల ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగించుకోవాలని కోరారు. బిపి, షుగర్ తో బాధపడేవారు తప్పనిసరిగా మందులు క్రమం తప్పకుండా వాడాలని సూచించారు. రోజు వారీ బిపి, షుగర్ మందులు వాడటం వల్ల ఎటువంటి హనీ జరగదని, రోజువారి వాడటంవల్ల అలవాటుగా మారుతుందని చాలా మంది అపోహతో మందులు నిలిపివేస్తున్నారని అన్నారు. దీనివల్ల పక్షవాతం, గుండెజబ్బులు, ఇతర సమస్యలు తలెత్తున్నాయని తెలిపారు. ఛాతినొప్పి, గ్యాస్ట్రైటిస్, తలనొప్పిగా సాధారణంగా భావించరాదని, వైద్యుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. వైద్యులు ప్రశంస 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఆకెన పవన్, మాతంగి శ్రీనివాసరావు, జానకీపురం మాజీ సర్పంచ్ చిలకా వెంకటేశ్వర్లు, క్యాంపు నిర్వాహకులు యంగల గిరి, ఉజ్వలచరణ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది : డీఈవో రమేశ్

మద్దూరు (ధూళిమిట్ట): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని సిద్దిపేట జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్ అన్నారు. ధూళిమిట్ట హైస్కూల్లో గెజిటెడ్ హెచ్ఎం, ఎంఈవో అనుముల కరుణాకర్ రెడ్డి ఉద్యోగ విరమణకు డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి అవసరమైన మానవ వనరులను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ఉత్తమ సేవలు అందించడం ద్వారానే ఉద్యోగులకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా గెజిటెడ్ హెచ్ఎంగా, ఎంఈవో కరుణాకర్ రెడ్డి అందించిన సేవలు ఎనలేనివని కొనియాడారు. ప్రధానంగా ధూళిమిట్ట హైస్కూల్ అభివృద్ధి కోసం చూపిన చొరవ అభినందనీయమన్నారు. అంతకుముందు విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

40 ఏళ్ల తర్వాత కలయిక.. మధుర జ్ఞాపకాల నెమరువేత!

గురువులకు ఘన సన్మానం

రఘునాధపాలెం :ప్రజా జ్యోతి నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఆప్యాయ పలకరింపులతో సందడి చేశారు. ఏన్కూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986--87 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఖమ్మంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా ఒకచోట చేరి పాఠశాల నాటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఏలూరు కృష్ణమూర్తి, దాసు, జయరామ్ సూరిలను ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గురువుల బోధన, మార్గదర్శకత్వంతోనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్నామని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో వజినేపల్లి శ్రీనివాసరావు, మాదినేని శ్రీనివాసరావు, చీకటి రమేష్, భూమా నరసింహారావు, కంభంపాటి నాగేశ్వరరావు, యండ్రతి శ్రీనివాసరావు, జర్రిపోతుల సుందర్ రావు, మేడ ధర్మారావు, స్వర్ణ ప్రహ్లాదరావు, జగ్గు, వీరన్న, నంబూరి రాము,



గెల్లి సత్యనారాయణ, ముదిగొండ నరసింహారావు, వందనపు నారాయణ, కేఎన్వీ జ్యోతి, మాలతి, శ్రీదేవి, కృష్ణకుమారి, శారద, వాణి, ఉష, పద్మ, ఝాన్సీ, మణి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సంక్షేమం హక్కుల సాధనే టీజేఎఫ్ లక్ష్యం



ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీజేఎఫ్) నిరంతరం పనిచేస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుతోట ఆదినారాయణ పేర్కొన్నారు.సమిష్టి కృషి, ఐక్యతతోనే జర్నలిస్టుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో నినాదం పత్రిక అక్రిడేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నూతనంగా అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులకు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నాయకత్వం ఎల్లప్పుడూ ముందుండి పోరాడాలని సూచించారు. జిల్లాలో అక్రిడిటేషన్ కార్డుల మంజూరు విషయంలో అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అనేక కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో టీజేఎఫ్ కీలక పాత్ర పోషించిందని, అల్లం నారాయణ నాయకత్వంలో కొద్దిమందితో ప్రారంభమైన సంఘం నేడు రాష్ట్రవ్యాప్తంగా బలమైన జర్నలిస్టు సంఘంగా ఎదిగిందని గుర్తుచేశారు. ఖమ్మం జిల్లా అక్రిడిటేషన్ కమిటీలో టీజేఎఫ్‌కు ఒక్కరి ప్రాతినిధ్యం మాత్రమే ఉన్నప్పటికీ, చిన్నా పెద్దా పత్రికలనే తారతమ్యం లేకుండా అర్హులైన ప్రతి జర్నలిస్టుకూ కార్డు మంజూరు చేయాలనే లక్ష్యంతో పోరాడామని తెలిపారు.అధికారులతో దశలవారీగా చర్చలు జరుపుతూ సమన్వయంతో వ్యవహరించడం ద్వారా జిల్లాలో 1,200 అక్రిడిటేషన్ కార్డుల మంజూరుకు కృషి చేశామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా టీజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిర్రా రవి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థకు నాలుగో స్తంభమైన జర్నలిస్టులు ప్రజల పక్షాన నిలిచినప్పుడే పాత్రికేయ వృత్తికి నిజమైన గౌరవం లభిస్తుందని అన్నారు.పరిశోధనాత్మక వార్తలతో ప్రజా సమస్యలను, అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకురావడంలో ఆదినారాయణ చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. ఆయన నాయకత్వంలో టీజేఎఫ్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం నినాదం పత్రిక జిల్లా, మండల స్థాయి రిపోర్టర్లకు అక్రిడిటేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీజేఎఫ్ టౌన్ ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు,నినాదం బ్యూరో ఇన్‌చార్జి బిక్కి గోపి, స్టాఫర్ నరసింహారావు, సంగమేశ్వర ప్రసాద్, సత్తుపల్లి ఆర్ సి ఇంచార్జీ ధూపాటి నరేష్ రాజు,మాదవి వెంకయ్య, పాషా, కూరపాటి నరేష్ మహేష్,శ్రీనివాస్,శంకర్, పవన్, తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం ఘనంగా 'జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం

కాలేయ ఆరోగ్యంపై అవగాహన - 100 మందికి ఉచిత హెపటైటిస్-బి టీకాల పంపిణీ







ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి కాలేయ సంబంధిత వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా "జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్" ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హెపటైటిస్-బి టీకా, లివర్ ఫైబ్రోస్కాన్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సునీల్ కుమార్ జంగాల ఎండీ ,డీఎం, డాక్టర్ స్వాతి జంగాల పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. ఉచిత సేవలు: ఈ శిబిరానికి విచ్చేసిన 100 మంది బాధితులకు ఉచితంగా వైద్య పరీక్షలు మరియు కన్సల్టేషన్ నిర్వహించారు. ఫైబ్రోస్కాన్ 50 నిర్వహించారు.మొత్తం 31 మందికి ప్రాణాంతక హెపటైటిస్-బి నుండి రక్షణ కల్పించేలా ఉచిత టీకాలను వేయడం జరిగింది. సేవా దృక్పథం: ఆదివారం శిబిరంలో జంగాల రాజేశ్వర్‌రావు సేవ్ యువర్ లివర్ ఫౌండేషన్ ద్వారా టీకాలు కిట్లు మరియు వైద్య సేవలను ప్రజలకు ఉచితంగా అందించింది.


రోడ్డు పనులపై ముష్టికుంట్ల రైతుల అభ్యంతరం

రూ.5.50 కోట్ల అభివృద్ధి పనుల్లో భూములు కోల్పోతామంటూ ఆందోళన

ఇరువైపులా సమానంగా పనులు చేపట్టాలి


ఏఐకేఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు

బోనకల్, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల--గార్లపాడు రహదారి అభివృద్ధి పనులపై ముష్టికుంట్ల రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. రహదారిని ఇరువైపులా సమానంగా విస్తరించాల్సి ఉండగా, ఒకవైపు ఉన్న తమ వ్యవసాయ భూములను రోడ్డు నిర్మాణంలో కలిపేస్తున్నారని ఆరోపిస్తూ పనులను అడ్డుకున్నారు. ఈ రహదారి అభివృద్ధికి ప్రభుత్వం రూ.5.50 కోట్ల నిధులు కేటాయించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా పనులకు శంకుస్థాపన జరిగింది. రహదారి పూర్తయితే రైతులకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు మెరుగైన కనెక్టివిటీ లభించనుంది. ఈ సందర్భంగా ఏఐకేఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు రైతుల అభ్యంతరాలను ప్రస్తావిస్తూ, రహదారి విస్తరణలో రైతులకు నష్టం కలగకుండా ఇరువైపులా సమానంగా పనులు చేపట్టాలని కోరారు. అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



ఖమ్మంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల కోసం బటర్‌ఫ్లై స్పెషల్ వింగ్స్

నూతన కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించిన చిల్డ్రన్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కురాపాటి ప్రదీప్ కుమార్





ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి స్థానిక ?చెరువు బజార్, అబ్దుల్ కలాం రెండవ వీధిలో ఏర్పాటు చేసిన కేంద్రం ద్వారా ప్రత్యేక జీవిత నైపుణ్యాల శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
కేంద్రం ప్రత్యేకతలు, నిపుణులైన థెరపిస్టులు: ప్రత్యేక పిల్లల శారీరక, మానసిక వికాసం కోసం అనుభవజ్ఞులైన థెరపిస్టులు అందుబాటులో ఉంటారు. పనివేళలు: ప్రతిరోజూ ఉదయం 9:00 నుండి సాయంత్రం 4:00 వరకు సేవలు అందిస్తారు. ?ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకులు,మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి ఆకుల,థెరపిస్ట్ బి. సుకృతి ఇతర ముఖ్య నాయకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కమల్ రాజు గురించి మాట్లాడే హక్కు నీకు లేదు

బిఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకుడు గద్దల వెంకటేశ్వర్లు

బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన నాయకులు

బోనకల్, నవంబర్ 1 (ప్రజా జ్యోతి): మాజీ జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు గురించి మాట్లాడే హక్కు నీకు లేదని, ఆయనపై అనుచిత వ్యాఖ్యలు మాట్లాడితే సహించమని బిఆర్ఎస్ ఎస్సీ సెల్ నాయకుడు గద్దల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో బిఆర్ఎస్ నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గద్దల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... మాజీ జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు పై కాంగ్రెస్ నాయకుడు బీపీ నాయక్ మాట్లాడిన అనుచిత వ్యాఖ్యలను వారు తీవ్రంగా ఖండించారు. మాట్లాడేటప్పుడు ముందుగా సంస్కారం నేర్చుకొని మాట్లాడాలన్నారు. ఎలాంటి అవగాహన లేకుండా మాట్లాడడం చూస్తున్న ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. కమల్ రాజు చరిత్ర గురించి మాట్లాడే హక్కు తమకు లేదని మండిపడ్డారు. రాజకీయ అనుభవం లేని బీపీ నాయక్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న బోనకల్ ఉపసర్పంచ్ బానోత్ కొండ గురించి మాట్లాడడం నీ విజ్ఞతకు నిదర్శనం అని అన్నారు. అదేవిధంగా ఒకరి వ్యక్తిగత విషయాలను గురించి మాట్లాడేటప్పుడు చదువుకున్న జ్ఞానం ఉపయోగించి మాట్లాడాలని అన్నారు. కనీస రాజకీయ అనుభవం లేకుండా మాట్లాడడం సిగ్గుచేటుగా ఉందన్నారు. కమ్యూనిస్టులో ఎంతో అనుభవజ్ఞుడైన నాయకుడు కమల్ రాజు అని అన్నారు. బోనకల్ గ్రామంలో బోనకల్ సర్పంచ్ బానోత్ జ్యోతి , ఉప



సర్పంచ్ బానోత్ కొండ , పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఎటువంటి పార్టీ గుర్తులు లేకుండా దసరా, బతుకమ్మ, దీపావళి శుభాకాంక్షలు ఫ్లెక్సీలు పెడితే ఆ ఫ్లెక్సీ ని తొలగించడం ఒక గిరిజన మహిళా సర్పంచును అవమానించినట్లే అని కాంగ్రెస్ నాయకుడు బీపీ నాయక్ పై మండిపడ్డారు. దసరా బతుకమ్మ సంబరాలను ఎంతో ఘనంగా నిర్వహిస్తుంటే సహించలేని బిపి నాయక్ ఫ్లెక్సీలు తొలగించి వివాదాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నాడని మండిపడ్డారు. ఎటువంటి రాజకీయ వివాదాలు లేని ప్రశాంత వాతావరణమైన బోనకల్ లో వివాదాలు సృష్టించడానికి బిపి నాయక్ ప్రయత్నిస్తున్నాడని బిఆర్ఎస్ నాయకులు గద్దల వెంకటేశ్వర్లు తీవ్రంగా విమర్శించారు. ఓ మహిళా సర్పంచిని పాలన చేసుకోకుండా సోషల్ మీడియాలో అనవసరమైన పోస్టింగులు పెట్టి ఒక మహిళపై గౌరవం లేకుండా మాట్లాడి గ్రామంలో ఘర్షణలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్న బీపీ నాయక్ ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు గుగులోతు శ్రీను, అంతోటి రవి ప్రసాద్, యంగల కనకయ్య, బానోతు మురళి తదితరులు పాల్గొన్నారు.

రెండో వార్డులో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ వేగవంతం...

ఇంటింటికీ వెళ్లి పట్టభద్రులకు ఓటు నమోదుపై అవగాహన...





ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు ప్రక్రియను వేగవంతం చేశారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఆదేశాల మేరకు, వార్డు కౌన్సిలర్ సూచనలతో రెండో వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏనుగు మహేష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డులోని పలు ఇళ్లను సందర్శించి పట్టభద్రులను కలిసి ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచిస్తూ, ఇంటింటికీ వెళ్లి ఓటు నమోదు చేయించారు. పట్టభద్రులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలకుర్తి రామారావు, దోసపాటి లింగయ్య, కందుల బాబు, వల్లెబోయిన శ్రీను, రమేష్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేజీబీవీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం.

కారేపల్లి, నవంబర్ 1, ప్రజా జ్యోతి : చదువు మానివేసిన విద్యార్థుల జీవితాలలో వెలుగు నింపిన కస్తూర్బా విద్యాలయం ఆడ పిల్లల చదువు విలువ తెల్పిందని కారేపల్లి కస్తూర్బా విద్యాలయ విశ్రాంత స్పెషల్ ఆఫీసర్ బుగ్గవీటి సుదర్శనావు, డైట్ కళాశాల అధ్యాపకులు ఎస్.వెంకటేశ్వర్లు అన్నారు. కారేపల్లి కస్తూర్బా గాంధీ విద్యాలయ 2010-11 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఈ సమ్మేళనం విద్యార్థుల గత పరిస్థితి, నేటి పరిస్థితి ని తెలిపి ఉద్వేగ భరితులైనారు. తాము జీవితాల్లో నిలదొక్కుకోవటానికి కస్తూర్బా విద్యాలయం బాటలు వేసిందని పూర్వ విద్యార్థినులు వివరించారు. తమ కుటుంబాలను తీర్చిదిద్దుకోవటంలో అప్పటి గురువుల పాత్రను, అనాటి జ్ఞాపకాలను వారు గుర్తు చేసుకున్నారు. ఈసంధర్భంగా అప్పటి స్పెషల్ ఆఫీసర్ బుగ్గవీటి సుదర్శన్ రావు మాట్లాడుతూ విద్యార్థులు, వారి కుటుంబాలు సమాజంలో ఉన్నతి స్థితికి ఎదిగితే అనందించింది చదువు చెప్పిన గురువులే అని అన్నారు. చదువు చెప్పిన గురువులను గుర్తుంచుకోని సన్మానించటం అభినందనీయమన్నారు.
ఈకార్యక్రమంలో కారేపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు భీమవరపు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కే.రమా, రిహానాబేగం, నాగమణి, భానుమతి, షహీనా బేగం, స్వరూప, పూర్వ విద్యార్థులు ఆవుల మౌనిక, జ్యోతి, రేణుక, నాగమణి, రమ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు కాంగ్రెస్ పార్టీ ఆస్తులు కావు!

అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలి.. రాజకీయ వివక్షకు స్వస్తి పలకాలి

ప్రభుత్వ కార్యక్రమాలు తమ పార్టీ కార్యక్రమాలు కావనే విషయాన్ని గుర్తు ఎరగాలి

ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లలో అన్యాయంపై సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఉన్నం రంగారావు ఆగ్రహం



ఖమ్మం రూరల్ ప్రజా జ్యోతి : ప్రభుత్వ పథకాలు కాంగ్రెస్ పార్టీ ఆస్తులు కావని, ప్రజాధనంతో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ఏ ఒక్క పార్టీకి గుత్తాధిపత్యం లేదని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు ఉన్నం రంగారావు స్పష్టం చేశారు.ఆదివారం ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్ మండల సీపీఐ జిల్లా సమితి సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హతే ప్రామాణికంగా ఉండాలని, రాజకీయ అనుబంధం ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేయడం సరికాదన్నారు. పార్టీ జెండాలు మోసిన వారికే ప్రాధాన్యత ఇస్తూ, ఏళ్లుగా సొంత ఇల్లు లేక నిరుపేదలుగా జీవిస్తున్న కుటుంబాలకు అన్యాయం చేస్తున్నారంటూ ప్రభుత్వ తీరుపై విమర్శలు గుప్పించారు. కేవలం కాంగ్రెస్ పార్టీ వాళ్లే ఓట్లు వేస్తే ప్రభుత్వం ఏర్పడలేదని, ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చారన్నారు. ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందించాల్సిన బాధ్యతను విస్మరించకూడదని హితవు పలికారు. అధికార పార్టీ కార్యకర్తలకే ప్రాధాన్యతనిస్తూ నిజమైన లబ్ధిదారులను పక్కనపెడుతున్నారన్న ఆరోపణలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం జాప్యం చేస్తోందని, వృద్ధాప్య, వితంతు, వికలాంగ, చేనేత కార్మికుల పెన్షన్ల విషయంలో లబ్ధిదారులను నిరీక్షణకు గురిచేస్తోందని మండిపడ్డారు. పేదల జీవనాధారమైన పెన్షన్ల మంజూరులోనూ నిర్లక్ష్యం ప్రదర్శించడం బాధాకరమన్నారు. హామీలను అమలు చేయలేని పరిస్థితి ఉంటే ప్రజలకు స్పష్టత ఇవ్వాలని, అర్హులైన వారందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ పంపిణీతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలను సైతం అధికార పార్టీ కార్యక్రమాలుగా మార్చుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ప్రజలచే ఎన్నుకోబడిన సర్పంచులు, వార్డు సభ్యులు, కౌన్సిలర్లకు ప్రభుత్వ కార్యక్రమాల్లో తగిన గౌరవం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో రాజకీయ ఆధిపత్య ధోరణులకు స్వస్తి పలకాలని సూచించారు. ఏదులాపురం మున్సిపాలిటీలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని, పెండింగ్ పెన్షన్లను మంజూరు చేయాలని, సంక్షేమ పథకాల అమలులో వివక్షకు తావులేకుండా చూడాలని డిమాండ్ చేస్తూ రేపటి నుంచే దశలవారీ ప్రజా ఉద్యమాలు చేపడతామని రంగారావు ప్రకటించారు. మున్సిపల్, రెవెన్యూ కార్యాలయాల ఎదుట ఆందోళనలు నిర్వహిస్తామని, పేదలకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేడికంటి వెంకటరెడ్డి, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కరరావు, వెంపటి సురేందర్, ఎడ్లపల్లి శంకరయ్య, బూర నాగేశ్వరరావు, భానోత్ రామ్‌కోటి, పాల్తియా శ్రీను, స్థానిక కౌన్సిలర్లు దండి రంగారావు, మామిళ్ల శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు



మధిర ప్రజా జ్యోతి మధిర బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అధ్యక్షతన ఆదివారం మధిర రూరల్, మున్సిపాలిటీ, ఎర్రుపాలెం మండలాల పార్టీ ముఖ్య నాయకులు, గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇన్‌చార్జిలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పార్టీ శ్రేణులకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నవంబర్ 6వ తేదీలోపు పూర్తిస్థాయిలో పూర్తి చేసి విజయవంతం చేయాలని నామా సూచించారు. పార్టీ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చే ప్రతి పిలుపును నాయకులు, కార్యకర్తలు బాధ్యతాయుతంగా తీసుకుని విజయవంతం చేయాలన్నారు. పార్టీ నిర్ణయించిన కార్యాచరణకు అనుగుణంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని, ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. పార్టీ కష్టకాలంలో పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఓటర్లను చైతన్యపరచడం, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదులో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడం, గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేసేలా పక్కా ప్రణాళికతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఇటీవల కర్ణాటకలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాలుగు స్థానాల్లోనూ ఓటమి పాలైందని పేర్కొంటూ, తెలంగాణలోనూ ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి అంతకంటే ఘోరంగా ఉందని వ్యాఖ్యానించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని కోరారు. గత ఎన్నికల్లో జరిగిన పొరపాట్ల నుంచి పాఠాలు నేర్చుకుని, రాబోయే ఎన్నికల్లో పకడ్బందీ వ్యూహంతో పనిచేయాలన్నారు. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో విజయం చేజారినప్పటికీ ఏనుగుల రాకేష్ రెడ్డి నిరంతరం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ ప్రజల మధ్యే ఉంటున్నారని నామా పేర్కొన్నారు. అలాంటి నాయకుడికి రాబోయే రోజుల్లో అండగా నిలిచి, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించిన నామా.. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కమిషన్ల వ్యవహారమే నడుస్తోందని, ప్రజల ఆస్తులు, సొమ్మును దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అంటేనే దోపిడీ అన్న పరిస్థితి నెలకొందని విమర్శించారు. జిల్లాలో మంత్రుల ద్వారా జరిగిన అభివృద్ధి శూన్యమని వ్యాఖ్యానించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజలు బీఆర్ఎస్ పక్షాన ఉన్నారని అన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పల్లెలు, పట్టణాలు అభివృద్ధి చెందాయని, ఆ సమయంలో విద్యుత్, తాగునీరు, సాగునీటి విషయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారని నామా వివరించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాయకులు, కార్యకర్తలు నిరంతరం స్పందిస్తూ ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలు, యువత, సీనియర్లు పరస్పర సమన్వయంతో ఒక టీమ్‌గా పనిచేయాలని, పార్టీ అధిష్ఠానం చేపట్టే కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నామా పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో పార్టీ కోసం ప్రతి ఒక్కరూ మరింత పట్టుదలతో పనిచేస్తూ మధిర నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో మధిర రూరల్, మున్సిపాలిటీ, ఎర్రుపాలెం మండలాల కోఆర్డినేటర్లు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు బాధ్యులు, బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనం గా ఉషోదయ కాన్వెంట్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భావిజీవితం అద్భుతం గా గడవాలని విద్యార్థులను ఆశీర్వదించిన సుశీల విద్యాసంస్థల అధినేత కరివేద వెంకటేశ్వరరావు





మధిర ప్రజా జ్యోతి స్థానిక దెందుకూరు రోడ్ లోని ఎస్సార్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం మధిర ఉషోదయ కాన్వెంట్ లో 2000-2001 విద్యాసంవత్సరం లో 10 వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తమ సిల్వర్ జూబ్లీ గెట్ టుగెదర్ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు.ఆనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందం గా గడిపారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనం గా సత్కరించి వారికి పాదాభిషేకం చేసారు. ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త సుశీల విద్యాసంస్థల అధినేత ఉషోదయ కాన్వెంట్ కరస్పాండెంట్ కరివేద వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో 25 సంవత్సరాల క్రితం చదువునభ్యసించి అందరు విద్యార్థులు ఒకచోటకు చేరి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించటం అభినందించదగిన విషయమని మా విద్యార్థులు ఉన్నత స్థానాలకు ఎదగటం ఎంతో గర్వంగా ఆనందంగా ఉందని పేర్కొన్నారు.వీరు భవిష్యత్తులో మరింతగా ఉన్నత శిఖరా లకు చేరుకోవాలని వారి భావి జీవితం అద్భుతంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాటి పాఠశాల ఉపాధ్యాయులు పిఆర్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ రంగారావు జిల్లా అసోసి యేట్ అధ్యక్షులు ఆర్ బ్రహ్మారెడ్డి,,నకిరికంటి గోవింద్, అడ్వకేట్వేణు గోపాలరెడ్డి, టి. శ్రీనివాసరావు కె.ఆదాం నాగయ్య, వెంకటరెడ్డి మేడిశెట్టి కృష్ణారావు,పర్వతం శ్రీనివాస రావు, కార్యక్రమ నిర్వాహ కులు పూర్వ విద్యార్థులు శ్రావణి,డాక్టర్ ఆరీఫ్, దీప్తి భవ్య,దివ్య, గోపాల రావు వెంకట నరేష్, రఘుపతి,చందన, సుమ న్, నాగుల్ మీరా,క్రాంతి,ఈశ్వర లక్ష్మి వివిధ ప్రాంతాల్లో మంచి ఉద్యోగాల్లో స్థిరపడి తదితరులు ఈ సమ్మేళనంలో ఆనందంగా పాల్గొన్నారు..

పాలేరు గ్రామంలో ఐకెపి కేంద్రం ప్రారంభం

పాలేరు సర్పంచ్ నాగేశ్వరరావు



పాలేరు ఆర్.సీ నవంబర్01 ప్రజా జ్యోతి కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో శనివారం ఐకెపి ధాన్యం కొలువులు కేంద్రంను స్థానిక సర్పంచి నాగేశ్వరరావు, పాలేరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టి శ్రీనివాస్ రెడ్డి కలిసి ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ధాన్యం విక్రయాల్లో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. రైతులు తమ ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తూర్పారబట్టి శుభ్రం చేసి ఐకెపి కేంద్రాలకి తరలించాలని సూచించారు. అలాగే రైతులకు ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు కొనుగోలు చేసి వెంటనే తరలించాలని రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని ఐకెపి అధికారులకు సూచించారు. దళారులకు అమ్మి మోసపోవద్దని ప్రభుత్వ మద్దతు ధరతో పాటు బోనస్ కింటాకు500 రూపాయలుకూడా వస్తుందని కావున రైతులు ప్రభుత్వ ఐకెపి సెంటర్లో అమ్ముకోవాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో పాలేరు గ్రామ సర్పంచ్ నాగేశ్వరావు , కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తులఉప్పయ్య కాంగ్రెస్ పార్టీ వార్డు నెంబర్స్ భక్తుల నరసయ్య , అచ్చయ్య ధైదల.వీరస్వామి పాలేరు గ్రామ రైతులు గ్రామ దీపికలు ఐకెపి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నీటి కోసం స్ఫూర్తిగా నిలిచిన.. ఆదర్శ నగర్ కాలనీ వాసులు



జహీరాబాద్ : ఎల్-నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తనున్న తీవ్ర నీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని జహీరాబాద్ పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీవాసులు ఆదర్శంగా నిలిచారు. నీటి వృథా నివారణే లక్ష్యంగా ఆదివారం కాలనీలో స్వచ్ఛందంగా ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 7 గంటల నుండే కాలనీవాసులు బృందాలుగా ఏర్పడి ప్రతి ఇంటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఎల్-నినో వల్ల వచ్చే ఏడాది వర్షాభావ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని, భూగర్భ జలాలు అడుగంటే ప్రమాదం ఉందని వివరించారు. నీటిని పొదుపుగా వాడటం, పైపుల లీకేజీలను అరికట్టడం, ఇంకుడు గుంతలు తవ్వడం, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ఏర్పాటు చేసుకోవడం వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ మమ్మద్ యూనివర్స్ , వైస్ చైర్మన్ శిరీష రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ఆదర్శనగర్ వాసులు చేపట్టిన ఈ కార్యక్రమం పట్టణంలోని అన్ని కాలనీలకు ఆదర్శమని, మున్సిపాలిటీ తరపున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రతి ఇంట్లో నీటి పొదుపు పాటిస్తామని ఈ సందర్భంగా కాలనీవాసులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన వెంకట్ రెడ్డి, సూర్ రెడ్డి, సుభాష్ రావు, యోగా గురువు నారాయణరెడ్డి, దత్తాత్రేయ రెడ్డి, శంకరప్ప పాటిల్, పాండురంగారెడ్డి, కౌన్సిలర్లు అరుణ్ కుమార్, జహంగీర్, నర్సింలు, నాగరాజు, శ్రీనివాస్ రెడ్డి, రాములు, హన్మ గౌడ్, గోపాల్, మల్లికార్జున్, ప్రభాకర్, నవీన, శివరాజ్, శంకర్, లింగన్నతో పాటు మహిళా ప్రతినిధులు, యోగా సమితి సభ్యులు, వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో రూ.60 లక్షల నకిలీ నోట్లు పట్టివేత!



హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో భారీగా నకిలీ కరెన్సీ నోట్లు పట్టుబడటం కలకలం రేపింది. రైలు ద్వారా తరలిస్తున్న రూ.60 లక్షల విలువైన నకిలీ నోట్లను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో రాజస్థాన్‌లోని బికనీర్ ప్రాంతానికి చెందిన శివరతన్ మహియాను అరెస్ట్ చేశారు.

జైపూర్ నుంచి ముంబయికి తరలింపు

పోలీసుల వివరాల ప్రకారం.. అక్టోబర్ 28న జైపూర్ రైల్వేస్టేషన్‌లో ఓం ప్రకాశ్ అనే వ్యక్తి నకిలీ కరెన్సీ ఉన్న బ్యాగును శివరతన్ మహియాకు అందజేశాడు. ఆ బ్యాగును ముంబయిలోని ఓ వ్యక్తికి అప్పగించాలని సూచించాడు. ఈ పని పూర్తి చేసినందుకు రూ. 2.20 లక్షలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నట్లు పోలీసులు గుర్తించారు.

రైలు ప్రయాణంలో పట్టుబడ్డ నిందితుడు

ఒప్పందం ప్రకారం శివరతన్ మైసూరు ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడకు చేరుకున్నాడు. అనంతరం అక్టోబర్ 31న ముంబయి ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో ప్రయాణిస్తుండగా రైల్వే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తనిఖీల్లో అతడి వద్ద ఉన్న బ్యాగులో రూ.60 లక్షల విలువైన నకిలీ కరెన్సీ నోట్లు లభించడంతో స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాన నిందితుడి కోసం గాలింపు

ఈ వ్యవహారంలో కీలకంగా భావిస్తున్న ఓం ప్రకాశ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడిపై రాజస్థాన్‌లో గతంలోనూ క్రిమినల్ కేసులు నమోదైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. నకిలీ నోట్ల మూలం, వాటిని ఎక్కడ తయారు చేశారు, ముంబయిలో ఎవరికి అందించాల్సి ఉంది అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పరారీలో ఉన్న ఓం ప్రకాశ్ కోసం గాలింపు చేపట్టారు.

పోలీస్ సైరన్‌కు భయపడి పరుగులు తీసి..

మొయినాబాద్: స్నేహితుడి బర్త్‌డే సందర్భంగా చేసుకున్న పార్టీ ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు తీసింది. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో శు క్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌లోని అత్తాపూర్‌కు చెందిన మోక్ష సాయిచరణ్ (19), నగరంలోని బల్కంపేటకు చెందిన యశ్వంత్ (20) మొయినాబాద్‌లోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం వీరితోపాటు చదివే స్నేహితుడి పుట్టినరోజు ఉండడంతో పది మంది కలిసి మొయినాబాద్‌లో బర్త్‌డే పార్టీ చేశారు. అనంతరం మద్యం పార్టీ చేసుకోవడానికి బాటిళ్లు తీసుకుని పెద్దమంగళారం రోడ్డులోని పద్మావతి ఫంక్షన్‌హాల్ వెనుకవైపునకు వెళ్లారు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం సైరన్ వేసుకుంటూ వెళ్లడంతో విద్యార్థులు భయపడి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి పరుగులు తీశారు. అక్కడ రైతు అడవి పందుల నుంచి కాపాడుకోవాలని వరిచేను చుట్టూ ఓ వైరుతో కంచె వేసి దానికి కరెంట్ షాక్ పెట్టాడు. ప్రమాదవశాత్తు ఆ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో ఇద్దరు విద్యార్థులు మృతి చెందారు. పోలీసులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇద్దరు విద్యార్థుల మృతితో కళాశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.